# ఫ్రీజ్ షాట్

ఎమ్మెస్సార్. మూర్తి

"ఆల్ లైట్స్...లైట్స్ ఆన్"

"ఫాన్స్ ఆఫ్''

"సై...లె...న్స్"

"టేక్...''

''కట్...''

''ఓ కె? ... ఓ కె!''

*  *  *

చెప్పుకోదగ్గ వ్యక్తిత్వం లేకపోయినా చిత్రసీమలో నా బ్రతుకుతెరువు స్థిరపడిపోయింది.

ఆ సీమలో ఉండే వాతావరణం మనుషుల్ని మరీ ఉక్కిరి బిక్కిరి చేస్తుంటుంది. ''ఎల్ కట్టర్'' పట్టుకుని షిఫ్టు అయ్యేంతవరకూ నిలబడ్డ బాయ్‌దగ్గర్నుంచీ ఫ్లైట్ టికెట్ దొరక్క పబ్లిక్‌కి భయపడి తన సినిమాకే వెళ్ళలేక గిజగిజలాడే హీరోగారి వరకూ అందరికీ ఏదో రిలీఫ్ కావలసివస్తుంటుంది.

ఈ రిలీఫ్ ఏదైనా కావచ్చు. ఏ పాటో, పద్యమో చిన్నప్పటి సంఘటనో, చిలిపి కబుర్లో—మిమిక్రీనో, మాజిక్కో ఏదైనా కావచ్చు. ఇలాంటి రిలీఫ్ ఇచ్చే వాళ్ళలో నాకూ ఓ పాత్ర ఉండడం అదృష్టమే!

నా బ్రతుకు తెరువు నేనే స్వయంగా వెతుక్కునే సాహసంలో నాకు మనుషుల్ని ఓపిగ్గా చూడడం, వినడం, పరిసరాలు గమనించడం బాగా బోధపడింది. ఎన్నో రహస్యాలని వినాల్సొచ్చింది. కొన్ని పరిస్థితులకు భయపడి దాక్కోవాల్సొచ్చింది. ఒళ్ళు తెలీకుండా నిద్రపోయే వాళ్ళనీ, వంటిమీద నూలుపోగులేకుండా మేల్కొన్నవాళ్ళనీ— ఇష్టంలేకపోయినా చూడాల్సొచ్చింది. ఆశయాల మొహమాటంకొద్దీ పస్తులు పడి ఉండాల్సొచ్చింది.

ఇలా జీవితంలో అన్నీ మౌనంగా గమనించడం నా దినచర్య అయింది. ఆలోచించడం తప్పనిసరి అయింది. ఉన్నదున్నట్టు చెప్పడం అలవాటయిపోయింది.

ఈ అలవాటుతో నాకు పట్టిన దుస్థితి—నేను కథలు బాగా చెప్తానన్న వదంతి.

ఈ రోజు కూడా అలాంటిదే జరిగింది. "రావోయ్...ఫరవాలేదు కూర్చో..." సుబ్రమణ్యం గారు పిలిస్తే వెళ్ళి గోడవారగా నిలబడ్డాను.

చుట్ట వెలిగించుకుంటూ అడిగారు, 'ఓ కథచెప్పూ' అని. అక్కడ ఆయనతోపాటు కూర్చున్న అయిదుగుర్లో ముగ్గురు వెంటనే ఎక్స్‌ప్రెషన్స్ మార్చారు. ఒకాయన కప్పువేపు చూస్తే మరొకాయన టాయిలెట్ వేపు నడిచాడు.

వాళ్ళ ఇబ్బందులు నాకు తెలుసు వాళ్ళకున్న కాలం విలువ అంత గొప్పది కావడమే కాకుండా నా అంతస్తు నేలబారింది. వాళ్ళ ముందు నా ప్రొఫైల్ మరీ పనికిరానిది. ఆఫ్టారాల్ నేనో "బాయ్"ని.

అలాంటి ఇబ్బందుల్ని ఎన్నో ఎదుర్కొన్న నేను అతి చిన్న కథల గురించే ఆలోచించే వాణ్ణి.

అసలదే చాలా తేలిక ! నా జీవితంలో గమనించిన సత్యాలన్నీ చిన్న చిన్న వాక్యాలు. నేను గొంతెత్తి అరవాలనుకున్నవన్నీ పట్టుమని ఓ రెండు మూడు మాటలు

ఇంతలో వాళ్ళకి డ్రింకు లొచ్చాయి. సోడా కలిపి గ్లాసుల్లో నింపి అందరికీ అందిచ్చాను. చిప్సుని ప్లేట్లలో సర్ది అందుబాట్లో ఉంచాను. వాళ్ళేవేవో మాట్లాడు కుంటున్నారుగదా- ఇక జారుకుందామనుకున్నాను.

సుబ్రమణ్యంగారు గబుక్కున గుర్తుకి తెచ్చుకు న్నట్టు కేకేసి—— ''చెప్పూ —— కచ్చెప్పవేం వన్... టూ...త్రీ...'' అన్నారు.

''అవన్నీ గుర్తుకు లేవండీ'' అన్నాను నసుగుతూ "నో...గ్గో ... చెప్పమంటే చెప్పాల్సిందే...పోజు కొట్టమాక''

**నేను చెప్తే గిప్తే ఆ కథ ఎంత సుదీర్ఘమోనన్న గంద్రగోళం అందరి ముఖాల్లోనూ ఉంది.**

''ఇప్పుడేం కథ...కానీయ్'' అన్నాడొకాయన ఆయన్ని వారిస్తూ సుబ్రమణ్యంగారు "కాదు సుబ్రావ్... ఒట్టూ. బ్రమ్మాళ్ళంగా చెప్తాడు. సింగిల్ టేక్. సరే నీకు దేవుడంటే వల్లమాలిన బక్తికదా——సరే ఉండు" అంటూ నావేపు తిరిగి ''చెప్పరా —— నిన్ను ఎనకేస కొస్తన్నానని ఈళ్ళంతా అనుకుంటున్నారు-' దేవుడి మీద మాంచి కచ్చెప్పు.''

ఇక తప్పేటట్లు లేదని ఆలోచిస్తున్నాను. గొంతు సవరించుకున్నాను.

''మంచినీళ్ళు కావాలా ఏందీ'' అన్నారు. సుబ్రమణ్యం గారు డ్రింకు గుటకేస్తూ-

లేచంటూ కథ మొదలెట్టాను.

" ఓ రాజుగారు ఎమర్జెన్సీలో ఓ వడ్రంగిని పిలిచి తెల్లారే సరికి వందగోతాల రంపపుపొట్టు తేవాలి- లేక పోతే తల తీయించేస్తానన్నాడు. పాపం దేవుణ్ని నమ్ము కున్నా- ఆ బీద వడ్రంగికి తెల్లవారక తప్పలేదు.''

అని కథని ఆపి అందరి ముఖాల్లోకి చూశాను. సుబ్రమణ్యంగారు గర్వంగా చూస్తూ చుట్ట పొగ వది లారు.

''వందగోతాల రంపపు పొట్టు రాత్రికి రాత్రే ఎక్కడ తేగలడు?" ఆశ్చర్యపోయాడు పంతులుగారు.

''మరి తెల్లారితే తల తీయించేస్తానన్నాడుగా" అంటూ రైటరు జమదగ్ని సిగరెట్ వెలిగించాడు.

''దేవుణ్ని నమ్ముకున్నాడుగా" సుబ్బారావు సమ ర్థన. సుబ్రమణ్యంగారు ముందుకు వంగి నావేపు చూస్తూ జాలిగా అన్నాడు "వాడి తల-తలతీసేరా:" అందర్నీ తృప్తిగా చూసి కథనిలా కొనసాగించాను.

''తెల్లారేటప్పటికి రాజదూతలు హు టా హు టి వడ్రంగి ఇంటికి వచ్చేరు. వడ్రంగి బిక్కమొహం వేశాడు. వచ్చిన దూతలు వడ్రంగిని రాజుగారికోసం అర్జంటుగా ఒక పెట్టెని తయారుచేయమన్నారు.

ఏం పెట్టె! ఎందుకూ? అని వడ్రంగి ఆశ్చర్య పోయాడు.

''అదే! రాత్రి హఠాత్తుగా చనిపోయిన రాజుని సమాధి చేసేందుకు - మంత్రిగారి ఆజ్ఞ అంటూ భటులు తల వంచుకున్నారు" అని కథ ముగించాను.

కాసేపు నిశ్శబ్దంలో డ్రింకులు తాగుతున్న గుట గుటలు - చిప్సు వెతుక్కుంటున్న వేళ్ళ చప్పుళ్లు.

''ఏం చదువుకున్నావురా-" అడిగారు రైటరు జమ దగ్ని. నేను తలవంచుకుంటే పంతులుగారు జాలిగా చూసేరు, రెడ్డిగారు ఫాన్ వేసుకున్నారు.

"రాజుల కథలే కాదోయ్ – రంకు కథలూ-బొంకు కథలూ – సోషల్ కథలూ – అపార్థం కథలూ – అన్నీ పూడుముక్కల్లో తేల్చేస్తాడు." అని నన్ను సమర్థించారు సుబ్రమణ్యంగారు.

ఆ ఉక్కిరి బిక్కిరికి రిలీఫ్ తెచ్చుకుని వెళ్తానన్నట్టుగా తలూపి – బయటికి వచ్చాను. ఎవరో నన్ను వెనక్కి పిలిచారు. వాళ్ళకి అన్నం తెమ్మన్నట్టో– నన్ను తినమన్నట్టో నాకు సరిగా వినపళ్ళేదు.

* * *

నా కథలు విన్న కొద్దిమందీ పత్రికలకి వ్రాయమని సలహా ఇచ్చేరు. వేసుకోరని కూడా పాపం వెంటనే ఒప్పేసుకున్నారు కూడా.

ఆమాటకొస్తే కథలు చెప్పడం ఎవరి సొత్తూకాదు, కాల్ షీటు ఎగ్గొట్టటానికి హీరోయిన్ కథ చెప్తుంది. పైకం అందించలేని ప్రొడక్షను మానేజరు కథ చెప్తూనే ఉంటాడు.

కాస్టూ, కథా నచ్చక, తన అసహాయతని అందమైన కథలో చెప్పి నిట్టూరుస్తాడు డిస్ట్రిబ్యూటరు, ఫైనాన్సు చెయ్యకుండానే.

ఇక తారల సంబంధాల గురించి ప్రేక్షకులు, పత్రికలు కథలు కథలుగా చెప్పుకోవడం అందరికీ తెలిసిన కథే —

ఇవన్నీ వ్రాస్తే ఎంత మంచి పెద్ద కథలో !

* * *

నలభై రోజుల షూటింగూ అయింది. కొందరికి ఇంటికి పరిగెత్తాలన్న తాపత్రయం, మరి కొందరికి ఇలాంటి రోజులు రావేమోనన్న తియ్యటి బాధ. మాప మామూలే – వేకువన నాలుగింటికల్లా 'పాకప్' అవమన్నారు.

రాత్రి పది కావస్తోంది. ఓ జత బట్టలు ఉతుక్కోవాలి. ఆకలవుతోంది, మెస్‌నుండి ఇంకా భోజనం రాలేను బ్యాంక్ మానేజర్ దగ్గర్నుండి ప్రొడ్యూసర్ రఘుపతిగారి కోసం కబురొచ్చింది. ఆయన కోసం నేను వెతుకుతున్నాను.

ఓ టెంట్లో శిఖామణిగారితో పేకాట ఆడుతున్నారు విషయం చెప్పాను. ఆట వదిలేసి బయల్దేరారు. పైకం విషయం గదా మరి !

రఘుపతిగారి ముక్కల్ని చూపిస్తూ-''నువ్వాడరా" అన్నారు శిఖామణిగారు. నేను సాహసించలేదు, 'ఆడవోయ్ మొఖమా' అంటే తప్పక ఎదురుగా ఉన్న కుర్చీలో ఒదిగి కూర్చుని ముక్కలు తీసుకున్నాను.

రెండు రౌండ్లలో శిఖామణిగారు కౌంటిచ్చారు.

బీరు తెమ్మన్నారు. తెచ్చి గ్లాసులో ఇచ్చాను.

'తాగుతావా?' అన్నారు – అడ్డంగా తలూపాను. అది మాటవరుస కేసని నాకు తెలుసుగదా! ముక్కలు పంచుతున్నాను.

శిఖామణిగారు సాలోచనగా త్రేనుస్తూ మద్రాసులో నేనెక్కడుండేదీ అడిగారు.

చెప్పాను.

ఇండస్ట్రీకి ఎప్పుడొచ్చిందీ అడిగారు. అదీచెప్పాను.

"తెలివిగలవాడివని విన్నాను, ఎవరైనా డైరక్టర్నంటిపెట్టుకుని ఉండరాదూ' అన్నారు ముక్కలేరుకుంటూ.

''ఎవరుంచుకుంటాడు" అన్నాను, ఉంచుకుంటారన్న మాటను వత్తి పలుకుతూ–

'జోకరేవిటీ–' గ్లాసు నెత్తుకుంటూ అడిగాడు.

'డైస్ రెండ'న్నాను– ముక్క చూపిస్తూ,

ఇలా వంటరిగా ఎవరితోనైనా గడపడమంటే నాకు సరదా– ఏ క్షణాన్నో వాళ్ళోకథ పారేసుకుంటారు. ఏరుకుందామన్న ఆతృత. లేకపోతే వాళ్ళే బక్షీస్‌గా కావాలనే ఓ చిన్న కథ ఎవరిదో ఇవ్వచ్చు.

'అమ్మ బ్రతికాను– నీకు లైఫుందా" అనడిగారు.

"ఇంకా లేద"న్నాను ముక్కల్లో జోకరు కోసం వెదుకుతూ—

"పోనీ నాదగ్గరే ఉంద్రా.-" అన్నారు.

'ఛీఛీ!' అన్నాను నేను. వెంటనే నాలిక్కరుచుకున్నాను.

"ఏం అంత డోకొచ్చింది," ఓ డ్రింకు గుటక వేస్తూ... "దాని క్లోజప్‌కి కళ్ళుమూసుకునేట్టున్నావే" ...అంటూ పగలబడి నవ్వేరు.

"అబ్బెబ్బె... అదికాదండీ— ఎంగ కో ఇష్టంలేదు— నేనెప్పుడూ ఫోటో దిగలేదంటే కూడ మీరు నమ్మరు" అన్నాను నన్ను నేను సమర్థించుకుంటూ.

'చంపేసేవు— నేను ఫోటోగ్రాఫరుగా ఉండేప్పుడు నే తీసిన ఫోటోలిమ్మని జనం తినేసేవాళ్ళు— ఎంతకీ ఇచ్చేవాణ్ణి కాదనుకో— అవునూ— వెంకట్రంగం అని ఒకడుండేవాడు. వాడి పెళ్ళికి ఫోటోలు తీయమని పిలిచాడు. ఎప్పుడైనా ఊరికివెళ్తే నేను షూట్ చేసిన సినిమా సంగతి మాట్లాడతాడేమో అనుకుంటాను—కానీ నా ఫోటోలా — అని వేధిస్తాడు."

'పాపం— పెళ్ళి ఫోటోలు గదండీ'' అన్నాను.

'ఏంచేస్తాం— టైమట్టా కలిసొచ్చింది. తీరా లోడ్ చేసుకెళ్లానా—' అంటూ ఆటలో నిమగ్నమయ్యాడు.

'ఫోటోలు తీయలేకపోయారు, అందే ఆ వెళ్ళేతోవలోనే ఇంకో మంచి సబ్జక్టు దొరికిఉంటుంది— షూట్ చేసుంటారు.' అన్నాను. ఆట అపి ఆయనవైపు చూశాను.

ఆయన నావేపు కొత్తగా చూస్తు— "అవునవును ఛాయిస్‌లేక— తీసేశాను— ఇక ఫిల్మ్‌లేదు— వెంకట్రం గాన్ని డిస్సప్పాయింట్ చేయలేక...'

'నటించారు— కేమేరాలో ఫిల్ములు లేకుండానే ప్లాషులు కొట్టారు. కానీ తెచ్చిన ఫిల్మయితే వేస్ట్ కాలేదు గదా—'

శిఖామణిగారు నావేపు ఈసారి మరింత నిశితంగా చూశారు. బహుశా నేనూహించి చెప్పిందంతా నిజమే అయిఉంటుంది. నావేపే చూస్తూ "అవును వేస్ట్ కాలేదు" అన్నారు పొడిపొడిగా.

ఇంకా శిఖామణిగార్ని ఉడికించాలని ఇలా అన్నాను.

'బహుశా తోవలో మీకు నచ్చిన అమ్మాయి కన్పించి ఉంటుంది. అలా ఓ అమ్మాయికోసం ఫిల్మ్ వాడేసేనని మీ ఫ్రెండ్‌కి చెప్పలేకపోయారు—అంతేగా!'

శిఖామణి పేకముక్కలు చేతిలోంచి జారిపోయాయి. ఆలోచనలు ఏవో తరుముతున్నట్టు ఆటమీద ఇష్టం లేనట్టుగా ముక్కలు అవతలికి జరిపి బీరు మరోగ్లాసు వంచుకున్నారు.

'అవునంతే— అద్సరే'— నా ముఖంలోకి సూటిగా చూస్తూ— 'సిదేవూహూ' అని అడిగాడు.

మెస్ నుండి వాన్ వచ్చినట్టుంది. జనం భోజనం దింపుతున్నట్టు గోల, కేకలు— ముక్కలవతల వేసి, పేక సరిచేసి— నేనూ లేచాను.

కానీ శిఖామణిగారు నన్నే చూస్తున్నారు.

చెప్పరాని తన కథనేదో చెప్తున్నంత కలవరంగా ఉన్నాయి ఆ చూపులు.

నాకు విపరీతంగా ఆకలవుతోంది 'వస్తానండీ—' అంటూ బయల్దేరాను.

ఇంకా శిఖామణి ఇటే చూస్తున్నాడు, నన్ను కెమెరాతో షూట్ చేస్తున్నంత తీక్షణంగా—

వెళ్తున్న నేను— ఎందుకో అనాలోచితంగా ఆగిపోయాను. ఆలోచించాను.

అవును!

మా వూరు!

మా వూరికి దగ్గర్లో ఉన్న టౌన్లో చిన్న ఫోటో స్టూడియో— ఆ స్టూడియోలో నేను పసివాడుగా ఉన్నప్పుడే పనిలో చేరేను— ఓ పండక్కి సున్నం కొట్టాల్సి వచ్చి స్టూడియో అంతా సర్దుతుంటే నాకు ఆ ఫోటోలు

కన్పించాయి. ఆ ఫోటోలని చూసినగోజే- నేను ఎక్కడికెళ్తున్నానో తెలియకుండానే రైలెక్కాను.

ఎందుకంటే- ఎందుకంటే- ఆ స్టూడియో సర్దుతుండగా కవర్లో కనిపించిన ఫోటోలన్నీ 'అమ్మవి'

బహుశా అవి తీసింది ... ఏమో...

అయివుండవచ్చు.

ఆ ఫోటోలు- ఇప్పటి శిఖామణి **మొఖంలో** కనిపించే మగవాడి సిగ్గులా-

నగ్నంగా ఉన్నాయి.

○ ○ ○

**అంకితం:**

పొట్టకూటికోసం పోతే
కడుపు మంటే ఎదురైందని చెప్పిన
**పుదుమై పరశురామన్‌కి**
ప్రీతితో...............

న్యాయం గెలుస్తుందన్న మాట నిజమే కానీ, గెలిచిందంతా న్యాయం కాదు.

- శ్రీశ్రీ